క్లుప్తంగా

తరలిన బీజేపీ శ్రేణులు



సభకు తరలివెళ్తున్న బీజేపీ శ్రేణులు

రామడుగు: జగిత్యాలలో నిర్వహించిన ప్రధాని మోదీ బహిరంగ సభకు మండలం నుంచి బీజేపీ నాయకులు భారీగా హాజరయ్యారు. రామడుగు, గోపాల్‌రావుపేట, దేశరాజ్‌పల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సంజీవరెడ్డి

రామడుగు: వరిలో తెగుళ్ల నివారణకు రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని రాంచంద్రాపూర్, చిప్పకుర్తి గ్రామాలలో సోమవారం రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఉల్లికోడు, అగ్గితెగులు, కాండం తొలుచు పురుగుల నివారణ గూర్చి చేపట్టాల్సిన రక్షణ చర్యలు రైతులకు వివరించారు. పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే నష్టం కలుగుతుందని తెలిపారు.

అయోధ్యకు గోపాల్‌రావుపేట వాసులు



సేవా కార్యక్రమాలకు వెళ్లిన భక్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన 15 మంది భక్తులు అయోధ్య రామమందిరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తరలివెళ్లారు. బాల రాముని మందిరంలో పలు ప్రదేశాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

రాజేశ్‌గౌడ్‌కు నివాళి

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన తెలంగాణ అమరుడు సుదగోని రాజేశ్‌గౌడ్ వర్ధంతిని గ్రామంలో సోమవారం నిర్వహించారు. రాజేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ... తెలంగాణ కోసం అనేక మంది యువకులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్, బోళ్ల వేణుగోపాల్, పందాల శంకరయ్య, మాజీ ఎంపీటీసీ గడ్డి గణేశ్, రమేశ్, కొంరయ్య, కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

వీణవంక: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పీసీసీ మెంబర్ కర్ర భగవాన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు వొడితెల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి అనంతరం ప్రణవ్ మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని, ఆరు గ్యారంటీలు అమలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చదువు జయపాల్‌రెడ్డి, నల్ల కొండాల్‌రెడి, కొమ్మిడి రాకేశ్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, మాదాసు సునీల్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కొంరయ్య, జమ్మికుంట సీనియర్ నాయకుడు వీరంనేని పరుశరాం రావు, తదితరులు ఉన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలందిస్తున్న ఎస్‌ఆర్‌కే ప్రతినిధులు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి, కోరపల్లి గ్రామాల్లో పలువురి వివాహానికి ఎస్‌ఆర్‌కే డెయిరీ అధినేత బండారి మారుతి సోమవారం పుస్తెమెట్టెలు అందించారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి సాయం చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ప్రతినిధులు అకుల రమేశ్, ఎర్రం శెట్టి కృష్ణారావు,రఘురామ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ‘బోనస్’ ఏదీ?

- అందని ప్రోత్సాహకం
- గత ప్రభుత్వం లీటరుకు నాలుగు రూపాయలంటూ ప్రకటన
- ఒకనెల మాత్రమే అందజేత
- మళ్లీ జాడలేని వైనం, కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు



వెదిరలో పాలకేంద్రం

రామడుగు: నాలుగేళ్ల క్రితం పాడి రైతులను ప్రోత్సహించడానికి, ఆదుకోవడానికి అప్పటి ప్రభుత్వం లీటరుకు నాలుగు రూపాయల ప్రోత్సహకం (ఇన్‌సెంటీవ్) అందజేస్తామని ప్రకటించింది. ఒకనెల మాత్రమే అందజేసి మళ్లీ పట్టించుకోలేదు. దీంతో పాలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని 23 గ్రామాలలో దాదాపు 40 వరకు పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిత్యం మూడు వేల లీటర్ల వరకు పాల సేకరిస్తున్నారు. నిర్వాహకులు పాలలో వెన్న శాతంపై డబ్బులు అందజేస్తుంటారు. దీంతో చాలా మంది రైతులకు కష్టపడి పాల ఉత్పత్తి చేసి కేంద్రాల్లో పోసినప్పటికీ గిట్టుబాటు కానీ పరిస్థితి. పాడి రైతుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ప్రతినెల లీటరు పాలకు నాలుగు రూపాయలు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రకటించి ఒక నెల అందజేశారు. తర్వాత ప్రోత్సాహకం అందజేయడం లేదు. చాలా సార్లు కేంద్రాల నిర్వాహకులు సంస్థలకు దృష్టికి రైతుల ఇబ్బందులను తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గత ప్రభుత్వం సమస్యను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యలను గుర్తించి ప్రోత్సాహకం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు. నిత్యం కష్టపడి పాలను తీసుకెళ్లి కేంద్రంలో పోసినప్పటికీ కనీసం గిట్టుబాటు రావడం లేదని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు.

కష్టపడుతున్నాం..



ఆవుపాలు ఉదయం, సాయంత్రం కేంద్రంలో పోస్తున్నా... కానీ పాలకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉంది. ఎంతో కష్టపడుతున్నా ఆశించిన ఫలితం కనిపించడంలేదు. ప్రభుత్వం ఐదు రూపాయల ప్రోత్సాహకం అందిస్తే బాగుంటుంది.

– గడ్డి కుమార్, పాడిరైతు,వెదిర

ప్రభుత్వం పట్టించుకోవాలి



పాలకు కనీస ధర అందని పరిస్థితి ఉంది. దీంతో చాలా మంది రైతులు పాడి పశువుల పెంపకంపై శ్రద్ధ చూపడం లేదు. గతంలో నాలుగు పశువులంటే ఇప్పుడు ఒక్కటి మాత్రమే ఉంది. ప్రభుత్వం పాడి రైతులను పట్టించుకోవాలి.

–వంచ సత్యనారాయణరెడ్డి, పాడిరైతు,వెదిర

ప్రతినెలా అడుగుతున్నారు



మూడేళ్ల క్రితం ప్రభుత్వం నాలుగు రూపాయల ప్రోత్సాహకం ఒకనెల మాత్రమే ఇచ్చింది. రైతులు ప్రతినెలా అడుగుతున్నారు. ఈ ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహకం అందించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– తిప్పారపు లక్ష్మీనర్సయ్య, పాల కేంద్రం నిర్వాహకుడు, వెదిర

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు సందర్శన



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌డీఓ, ఏసీపీ

ఇల్లందకుంట: కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన సిరిసేడు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును హుజూరాబాద్ డివిజన్ ఎన్నికల అధికారులు, ఆర్‌డీఓ రమేశ్‌బాబు, ఏసీపీ శ్రీనివాస్‌జీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో పలుఅంశాలపై చర్చించారు. చెక్‌పోస్టుల వద్ద చేపట్టాల్సిన ఎన్నికల నియమావళి చర్యల గూర్చి వివరించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు మీదుగా అక్రమ మద్యం, డబ్బు రవాణా కట్టడికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీల్లో నిర్లక్ష్యం వహించొద్దని అలాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్‌ఐ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ లైట్ అందజేత



ఎల్‌ఈడీ లైట్ అందజేస్తున్న కౌన్సిలర్ నరేశ్

జమ్మికుంట: పట్టణంలోని ఆరోవార్డు హౌజింగ్ బోర్డు కాలనీలోని దారు సలాం మజీద్ ఎదుట చీకటిగా ఉందని వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ దృష్టికి తీసుకురాగా సొంతఖర్చులతో ఎల్‌ఈడీ లైట్‌ను ముస్లిం మతపెద్దలకు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... రంజాన్ సందర్భంగా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్లింలు వస్తుంటారని, చీకటిగా ఉందని తెలపడంతో ఎల్‌ఈడీ లైట్ సమకూర్చానన్నారు. ఈసందర్భంగా ముస్లింలు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దాడిని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

జమ్మికుంట: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై ఎంపీపీ వెంకటరాధ దాడిని నిరసిస్తూ జమ్మికుంట ఎంపీడీవో కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై ప్రజాప్రతినిధులు దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమేశ్, ఎంపీవో సతీశ్‌కుమార్, ఏఈఉ శ్రీకాంత్, శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని దమ్మక్కపేట రైతువేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నామని మండల వ్యవసాయాధికారి చందుపట్ల సునీల్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్త డాక్టర్ బి. శ్రీనివాస్ వివరించనున్నారని, ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ రాజశేఖర్, వేసవిలో వివిధ కూరగాయ పంటల్లో వాడాల్సిన పురుగుల మందులను గూర్చి డాక్టర్ కె.కవిత వివరించనున్నారని, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

‘వీఎస్‌ఆర్’లో సాంస్కృతిక వారోత్సవాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హనుమకుమార్ తెలిపారు. వార్షికోత్సవాల్లో ఆట, పాటలు, ఉపన్యాస పోటీలు, డ్యాన్స్, వ్యాసరచన, వస్త్ర అలంకరణ, వంటల పోటీలు, ఫిల్మ్ ఫెస్టివల్స్ వంటి కార్యక్రమాలు ఉంటాయని, విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం(రామన్నపల్లి)గ్రామ శివారులోని సర్వేనంబర్ 389లోని చెరువు శిఖం 6.18 ఎకరాల భూమి అన్యాక్రాంతం అవుతుందని భూమికి హద్దులు నిర్ణయించి కాపాడాలని రామన్నపల్లికి చెందిన మేడిపల్లి ఓదేలు, రెడ్డ నాగరాజు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఒకే ఇంటినుంచి ముగ్గురు ట్రైనర్లు



సర్టిఫికెట్లు అందుకుంటున్న ట్రైనర్లు

మానకొండూర్: వ్యక్తిత్వ వికాస నిపుణులుగా మండలంలోని ఊటూరు గ్రామం ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు, కూతురు ట్రైనర్లుగా సర్టిఫికెట్స్ అందుకున్నారు. అదేవిధంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పబ్లిక్ ఎఫెక్ట్ స్పీకర్లు, అండ్ మోటివేషన్‌పై దాసరి అంజయ్య, ప్రశాంత్, కల్యాణి శిక్షణ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లోని హోటల్ మినర్వాలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ సర్టిఫికెట్స్‌ను ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు చేతులమీదుగా సోమవారం అందుకున్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులుగా విద్యార్థులు, యువతలో సామాజిక విద్యా విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు ఆటో సౌకర్యం



ఆటోను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల కోసం ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆటో సౌకర్యం కల్పించారు. ఈమేరకు సోమవారం విద్యార్థులకు స్వీట్లు పంపిణీచేసి జెండా ఊపి ఆటోను ప్రారంభించారు. ఏటా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఆటో సౌకర్యం కల్పిస్తున్నామని ఎంపీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ముంజాల అశోక్, సింగసాని కనకయ్య, గుండె వెంకటేశ్, ఐతరవేని మల్లేశం, గొల్లపల్లి మునీందర్, ముత్యాల శ్రీనివాస్, కనకయ్య, రాములు, తిరుపతి, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్పీ నూతన కమిటీ



హుజూరాబాద్‌రూరల్: మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పీ) నూతన కమిటీని ఎన్నిక పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నిక జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా కనుకుల గిద్దెకు చెందిన ఆళ్ల కేశవులు, మండల కన్వీనర్‌గా సిర్సపల్లికి చెందిన తునికి భాస్కర్, కో కన్వీనర్లుగా బొడ్డు సంపత్, కల్వల వీరస్వామి ఎన్నికయ్యారు. ఎంఎస్పీ జాతీయ నాయకుడు రామచంద్రం, నాయకులు మారేపల్లి శ్రీనివాస్, రేణిగుంట సాగర్, ఇంజం వెంకటస్వామి, బొరగాల సారయ్య, తుంగ ఆంజనేయులు, దేవునూరి రవీందర్, రొంటాల రాజ్‌కుమార్, మోరె సారయ్య పాల్గొన్నారు.

నైపుణ్యాల ద్వారా ఉన్నత విజయాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: నైపుణ్యాల ద్వారా విద్యార్థులు ఉన్నత విజయాలు అందిపుచ్చుకోవచ్చని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఇంటర్ పర్సనల్ స్కిల్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ట్రైనర్ ప్రవీణ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.మారుతితో పాటు లెఫ్టినెంట్ పి.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ స్వామి



కేంద్ర బలగాల కవాతు

జమ్మికుంట: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఆర్డీవో రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని వావిలాల, తనుగుల గ్రామాల్లో సోమవారం రాత్రి కేంద్ర బలగాలతో టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఏర్పాట్లు నిర్వహించనున్నామని, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

తిమ్మాపూర్: పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని తిమ్మాపూర్ సర్కిల్ సీఐ స్వామి సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లకు అండగా ఉన్నామని తెలియజేసేందుకు మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం సీఐఎస్ఎఫ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ విక్రాంత్ షాకీన్, సీఐమాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లను బాధ్యులుగా చేస్తామన్నారు. కులం, మతం పేరుతో పోస్టులు పెడితేచట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు, నాయకులుబెదిరించడం, మభ్యపెట్టడం చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎండీ ఎస్‌ఐ చేరాలు, ఆర్‌ఎస్‌ఐ రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పుష్పార్చన



పుష్పార్చన నిర్వహిస్తున్న వేదపండితులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి 52వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేదపండితులు పుష్పార్చన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలోవిశేష అభిషేకం, అధ్యయనోత్సవం, ద్రావిడ వేద పారాయణం, స్వామివారి ఆరాధన కార్యక్రమాలు చేశారు. కల్యాణదాతలు వంగళ వెంకటమ్మ, రాజగోపాల్‌రెడ్డిభారతమ్మ, శ్రీనివాస్‌రెడ్డిశారద, వంచ రవీందర్‌రెడ్డిలక్ష్మీ, బండ శ్రీనివాస్‌రెడ్డిపద్మ, చింతిరెడ్డి అంజిరెడ్డిలక్ష్మీభార్గవితో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి, వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం 20వ తేదీన మధ్యాహ్నం నిర్వహించనున్నామని దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్లు చెన్నమనేని రాజేందర్‌రావు, వీర్ల ప్రభాకర్ రావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఖాసీంపేటలో సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ శ్రీకారం చుట్టిందని, దశల వారీగా హామీలన్నింటిని అమలు చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, బద్దం సంపత్‌రెడ్డి, సింగిరెడ్డి లక్ష్మీకాంతరెడ్డి, తిప్పర్తి పరిపూర్ణచారీ, బొజ్జ ఐలయ్యయాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు బొజ్జ తిరుపతి, కయ్యం సంపత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు



జిజ్ఞాస పర్యవేక్షకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరాదేవి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. ఇందిరాదేవి తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... కళాశాల నుంచి తెలుగు, కామర్స్, ఎకనామిక్స్, హిస్టరీ, గణితం జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.లక్ష్మీనరసింహమూర్తి, జిజ్ఞాస పర్యవేక్షక ఉపన్యాసకులు ఎస్.మధు (తెలుగు), డా.జి. శ్రీనివాస్ (కామర్స్), ఎస్. శ్యామలాదేవి(ఎకనామిక్స్), ఎస్.సమ్మయ్య(హిస్టరీ), డి.స్వరూపరాణి (గణితం,) ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డా.పి.దినకర్ తదితరులు ఉన్నారు.



విద్యుత్ మరమ్మతులు చేసేదెలా..?

గ్రామీణ ప్రాంతాల్లో ఓ ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థ ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలను వినియోగిస్తుండటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్ మండలం బొమ్మకల్, గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, దుర్శేడ్ తదితర గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు ఇంటర్నెట్ వైర్లు, జంక్షన్‌బాక్స్‌లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సిబ్బంది ఏదైనా మరమ్మతులు వచ్చినపుడు స్తంభాలపైకి ఎక్కేందుకు వైర్లు అడ్డుగా ఉండటంతో పడరానీ పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను అక్రమంగా వినియోగిస్తున్న సంస్థపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్